అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్‌కుమార్



అంబర్‌పేట: అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న అశోక్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న కిరణ్‌కుమార్ అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై విచ్చేసి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే డీఐగా మహ్మద్ హఫీజుద్దీన్ సైతం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న డీఐ మహిళ పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు, కులగణన ప్రక్రియ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి పార్లమెంట్‌లో చట్టం చేయాలని చిత్తశుద్ధితో కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ విజయకుమార్‌గౌడ్, బీసీ సమైక్య అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయం

చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని వివేక్‌నగర్ అంజిరెడ్డి రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో సన్నబియ్యంతో వండిన ఆహారాన్ని ఆయన కార్యకర్తలతో కలిసి తిన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం చంద్రకళ, శంకర్, అభిషేక్ కెనడీ, శీలం సత్యనారాయణ, వీడీ కృష్ణ, కృష్ణ యాదవ్, మారిశెట్టి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (45) జూకల్–ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ షేర్ అలీ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. శుక్రవారం షేక్ అలీ వీధిలో అధ్వానంగా మారిన రోడ్డును తొలగించి నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... షేక్ అలీ వీధిలో రోడ్డు నిర్మాణానికి పలుమార్లు టెండర్లు ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. కాంట్రాక్టర్ వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు అనిల్‌కుమార్, జమాల్‌పురి నందు, సత్యనారాయణ, బాలకృష్ణ, లక్ష్మణ్, నర్సింగ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శంకర భగవత్పాదులకు 'శత రుద్రాభిషేకం'

ముగిసిన శంకర జయంతి మహోత్సవాలు

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో ఏప్రిల్ 28న ప్రారంభమైన శ్రీ శంకర జయంతి మహోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం శంకర మఠంలోని శక్తి గణపతికి ఆది పూజలు చేశారు. అలాగే శారదాంబకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శ్రీశంకర భగవత్పాదులకు 'శత రుద్రాభిషేకం' చేశారు. అలాగే శంకర భగవత్పాదులు, చంద్రమౌళీశ్వరస్వామిని పూలమాలలతో అలంకరించారు. విశేష పూజలు చేసి మహా మంగళహారతి ఇచ్చారు. ఇష్ట దైవాలను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులకు మహా ప్రసాద వితరణ కావించారు. సాయంత్రం మహామహోపాధ్యాయ, అద్వైత సిద్ధిరత్నాకర ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'శ్రీ శంకర విజయం'పై ఇచ్చిన ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. చివరగా భక్తుల జయజయ ధ్వానాల నడుమ శంకర భగవత్పాదచార్యుల ఊరేగింపు నిర్వహించారు.



ఎస్‌ఎల్ డయాగ్నొస్టిక్ సెంటర్ ఎదురుగా ఫుట్‌పాత్ ఆక్రమణ



నల్లకుంట శంకరమఠం వద్ద రోడ్డుకిరువైపులా వాహనాల అక్రమ పార్కింగ్



దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి ప్రధాన గేట్ వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణలు



విద్యానగర్ లక్మీకేఫ్ చౌరస్తా సమీపంలో ఫుట్‌పాత్‌పై నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్



శివం రోడ్డు లింగాల గడ్డ శివాలయం సమీపంలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వాహనాల పార్కింగ్

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల నడక..!

- ఆక్రమణల తొలగింపులో అధికారులు విఫలం
- నడిచేందుకు పాదచారుల అవస్థలు
- ఫుట్‌పాత్‌లపైనే మూత్రశాలలు, బస్ షెల్టర్లు
- శాశ్వత పరిష్కారం చూపాలని వినతులు



హుస్సేన్ సాగర్‌నాలా ఫుట్‌పాత్‌పై మూత్రశాల



నల్లకుంట మెయిన్ రోడ్డులోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఫుట్‌పాత్‌పై చెత్త తరలించే రిక్షా

నల్లకుంట: పద్మ వ్యూహం లాంటి ట్రాఫిక్.. వేగంగా వచ్చే వాహనాల నడుమ పాదచారులకు రోడ్లపై నడక పెద్ద పరీక్షే. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, శంకరమఠం రోడ్డు, నల్లకుంట రైల్వే ట్రాక్ నుంచి సిండికేట్ బ్యాంక్ వెళ్లే దారి... ఫీవర్ చౌరస్తా నుంచి తిలక్‌నగర్ చౌరస్తా వైపు వెళ్లే దారి... ఫీవర్ చౌరస్తా నుంచి బర్కత్‌పుర వెళ్లే ప్రధాన రహదారి.. శివం రోడ్డుకు వెళ్లే దారల్లో ఫుట్‌పాత్‌లు అన్నీ ఆక్రమణకు గురయ్యాయి. దీంతో పాదచారులు రోడ్లపై నుంచి నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఆక్రమణలను తొలగించి ఫుట్‌పాత్‌లు పాదచారులు వెళ్లేందుకు పకడ్బందీ చర్యలు తసుకోవాలని కోరుతున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలు చేసి వ్యాపారాలు సాగిస్తుండటం.. వారిని ఎవరూ ఏమీ అనకపోవడంతో పాదచారులకు తిప్పలు తప్పడం లేదు. గతంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమిస్తే జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి జరిమానాలు విధించారు. అంతే ఆ తర్వాత అక్కడితో వదిలేశారు. దీంతో మళ్లీ ఫుట్‌పాత్‌లపై దుకాణాలు వెలిశాయి.

◆ ఇటీవల ఫీవర్ ఆస్పత్రి సమీపంలోని హుస్సేన్ సాగర్ నాలా వద్ద ప్రయాణీకుల వినియోగం కోసం ఆర్టీసీ బస్ టర్మినల్ నిర్మాణం, ఎస్‌బీఐ వద్ద బస్ షెల్టర్, శంకరమఠం సమీపంలో బస్ షెల్టర్లను ఫుట్‌పాత్‌పైనే ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు వచ్చిపోయే విద్యార్థులు, ఉద్యోగులతో రద్దీగా మారుతోంది. ఈ సమయంలో ఫుట్‌పాత్‌లను పాదచారులు ఆశ్రయిస్తుంటారు. ఈ ఆక్రమణల వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో ట్రాఫిక్ నడుమ రోడ్డు మీదే నడవాల్సి వస్తోందని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించి పూర్తిస్థాయిలో ఫుట్‌పాత్‌లను పాదచారుల వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.



ఫీవర్ ఆస్పత్రి సిగ్నల్స్ సమీపంలో ఓ షాప్ ఎదుట ఫుట్‌పాత్ ఆక్రమణలు ఇలా..



ఫీవర్ చౌరస్తా టర్నింగ్‌లోని ఓ బుక్ స్టాల్ వద్ద రోడ్డు పక్కనే వాహనాల పార్కింగ్







నల్లకుంట మెయిన్ రోడ్డులోని ఎస్‌బీఐ ఎదురుగా బస్టాప్ వద్ద ఫుట్‌పాత్‌పై ఆటోలు, ఓ బుక్ స్టాల్ ఎదురుగా..., బ్యాంక్ ఆఫ్ బరోడ వద్ద..



ఫీవర్ ఆస్పత్రికి వెళ్లే రహదారిలో ఫుట్‌పాత్‌పై పార్కింగ్

ట్రంప్ విధానాలు ప్రపంచ శాంతికి తోడ్పడవు

మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ట్రంప్ విధానాలు ప్రపంచ శాంతికి తోడ్పడవని అవి కార్పొరేట్లకు మాత్రమే అనుకూలమని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దాచురి రామిరెడ్డి 9వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ... దాచురి రామిరెడ్డి గొప్ప మానవతా వాది అని కొనియాడారు. జాతీయ ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో గొప్ప పాత్ర పోషించడంతో పాటు ఆదర్శ ఎమ్మెల్సీగా నిలిచారన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేడు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచ శాంతికి ఏ మాత్రం తోడ్పడవని విమర్శించారు. ఉక్రెయిన్‌ను సగానికి పైగా రష్యా ఆక్రమించడంతో ఓటమి దిశగా వెళ్తున్న సందర్భంలో రష్యాతో యుద్ధం విరమించాలని శాంతి సందేశం అంటూ ట్రంప్ కొత్త నినాదాన్ని ముందుకు తీసుకువచ్చారని అన్నారు. కేవలం అగ్ర రాజ్యంగా అమెరికా కొనసాగడానికి మాత్రమే ట్రంప్ చర్యలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ప్రపంచ దేశాలపై సుంకాల పేరుతో పెద్ద ఎత్తున దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు చావ రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు నర్సిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, నాయకులు నరహరి, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకట్, కృష్ణమూర్తి, జంగయ్య, లక్ష్మారెడ్డి, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేడ బుడిగ జంగాలకు కార్పొరేషన్ అవసరం



బేడ బుడిగ జంగాల సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బేడ బుడిగ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు జరిగింది. సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు గగనం మంతప్ప, వ్యవస్థాపకులు తూర్పాటి హనుమంతు, గగనం శ్రీనివాసులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బుడిగ జంగాలు 0.02 శాతం కంటే మించి లేరన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు 10శాతం సీట్లు కేటాయించాలని వారు కోరారు. బేడ బుడిగ జంగాలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించి రాజకీయ చైతన్యం తెవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి గూడు కల్పించాలని వ్యవసాయం చేసేందుకు సాగుభూమిని కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా అధ్యక్షులు దూపం ఆంజనేయులు, సిరివాటి శ్రీనివాసులు, గగనం శేఖర్, చిన్న కోటయ్య, జి.కృష్ణ పారిజాతం తదితరులు పాల్గొన్నారు.

నాలా పూడికతీత పనుల పర్యవేక్షణ

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని గాంధీనగర్ లంకబస్తీని ఆనుకుని ప్రవహిస్తున్న హుస్సేన్‌సాగర్ నాలాలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఆదేశాలతో నాలా పూడికతీత పనులను చేపట్టారు. ఈ పూడికతీత పనులను శుక్రవారం కార్పొరేటర్ అమృత, డీఈ ప్రవీణ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈ పృథ్వీ, వర్క్ఇన్‌స్పెక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లలోకి వెళ్లకపోతే రద్దు చేస్తాం

- 968 మంది లబ్ధిదారులకు నోటీసులు
- ముషీరాబాద్ తహసీల్దార్ రాణా ప్రతాప్ సింగ్



కవాడిగూడ: ముషీరాబాద్ మండల పరిధిలోని మూడు నియోజకవర్గాలకు చెందిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు తాళాలు వేసిన వారికి సికింద్రాబాద్ ఆర్‌డీఓ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేస్తున్నామని... వారం రోజుల్లో వారు తాళాలు తీసి లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లకపోతే రద్దు చేస్తామని ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్ తెలిపారు. శుక్రవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

◆ మండల పరిధిలోని సికింద్రాబాద్, సనత్‌నగర్, ముషీరాబాద్ నియోజకవర్గాలకు చెందిన మొత్తం 968 మంది లబ్ధిదారులు వారికి కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాళాలు వేసి ఉంచారని పేర్కొన్నారు. అందులో ఎవరూ వెళ్లడం లేదని తెలిపారు. ఇళ్ల తాళాలు తీసి ఇళ్లలోకి వెళ్లాలని సూచించారు. లేని పక్షంలో వారికి కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

◆ అదే విధంగా రాజీవ్ యువ వికాస్ పథకం కింద ఆన్‌లైన్‌లో మొత్తం 9,006 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మ్యాన్యువల్‌గా 5000 దరఖాస్తులు వచ్చాయన్నారు. మ్యాన్యువల్‌గా వచ్చిన దరఖాస్తులను కులాల వారీగా విభజించి బ్యాంకు అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. మ్యాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోని వారు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న స్లిప్‌తో పాటు అన్ని డాక్యుమెంట్లను ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యమకారుడు యాదగిరి మృతి



(ఫైల్)

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ వాల్మీకినగర్ నివాసి తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ నాయకుడు ఆరూరి యాదగిరి (47) అమీర్‌పేటలో రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందారు. శుక్రవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ యాదగిరి పార్థీవదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్, గాంధీనగర్ డివిజన్ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్, పాల్గొన్నారు.

ఆట పరికరాలకు మరమ్మతులు చేయించండి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య పార్కులో విరిగిపోయిన పిల్లల ఆట పరికరాలకు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ విన్నవించారు.అదేవిధంగా షెటిల్ కోర్టును బాగు చేయాలని శుక్రవారం వినతి పత్రం అందజేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.

బీసీ సంఘాల పోరాట ఫలితమే కులగణన

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ



సమావేశంలో హైకోర్టు కోర్టు తీర్పు పత్రాలను ప్రదర్శిస్తున్న ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ

కాచిగూడ: జాతీయ జనగణనలో కులగణనతో పాటు బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 52 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించినప్పుడే బీసీల ఆకాంక్ష నెరవేరుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైకోర్టులో, సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని తెలిపారు. హైకోర్టు తీర్పు మేరకే తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే కులగణన చేపట్టిందని ఆయన గుర్తు చేశారు. బీసీ సంఘాల సమష్టి కృషి, సుదీర్ఘ పోరాట ఫలితమే దేశ జనాభా గణనలో కుగణనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసకున్న నిర్ణయాన్ని స్వాగతీస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

◆ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50శాతం ఇవ్వాలని కోరారు. బీసీలకు బడ్జెట్‌లో 2లక్షల కోట్లు కేటాయించాలని అన్నారు. దేశ వ్యాప్తంగా ఫీజు రియంబర్స్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కులగణన ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు కోలా జనార్ధన్, సుధాకర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, వంశీ, ఉదయ్, రూప, హరిచరణ్, వినోద్, హరితిలక్ సింగ్ తదితర బీసీ నేతలు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం



ముషీరాబాద్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, కార్పొరేటర్లు

ముషీరాబాద్: సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలని ప్రధాని నరేంద్రమోదీ కులగణన కోసం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనదని ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు అన్నారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. శుక్రవారం ఓబీసీ మోర్చా నేత ఉమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూస రాజు మాట్లాడుతూ... ప్రధాని మోదీ నిర్ణయంతో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి దేశ సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ముషీరాబాద్ డివిజన్ భరత్‌నగర్‌లో బీజేపీ నాయకులు జమాల్‌పురి నందు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. భోలక్‌పూర్ డివిజన్ రాజాడిలక్స్ చౌరస్తా వద్ద డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహంకాళీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న వర్గాలకు న్యాయం చేసేందుకే కులగణన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిచారి, నాయకులు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, సదానంద్‌ముదిరాజ్, బద్రినారాయణ, నందు, ఆర్.విశ్వం, కంచి ముదిరాజ్, కనకేష్‌కుమార్, రమేష్‌రాం, మహేష్‌కుమార్, అనిల్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



భరత్‌నగర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీజేపీ నాయకులు

కులగణనపై కేంద్ర నిర్ణయం.. రాహుల్ గాంధీ విజయం

టీపీసీసీ ఓబీసీ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్

నల్లకుంట: దేశవ్యాప్తంగా జనబా లెక్కలతో పాటు కులగణన చేపడతామని కేంద్ర క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విజయమని టీపీసీసీ ఓబీసీ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని నిర్ణయించడం అభినందనీయమని అన్నారు. దేశంలో చేపట్టే కుల గణనలో తెలంగాణ రాష్ట్రం రోల్‌మోడల్‌గా నిలుస్తోందన్నారు. శుక్రవారం నల్లకుంటలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కులగణనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరిస్తున్న విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేపట్టి తీరుతామని తమ అధినాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని చెప్పారు. భారత్ జోడో యాత్ర ద్వారా కన్యాకుమారీ నుంచి కశ్మీర్ వరకు రాహుల్ గాంధీ చేపట్టిన పాద యాత్రలో కులగణన ఎందుకు చేయాలని అనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. రాహుల్ గాంధీ ఎత్తుకున్న కులగణన అంశం ప్రజల్లోకి వెళ్లడంతో కేంద్రం దిగివచ్చి కుల గణన చేస్తామని ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి, అజయ్ కుమార్, భూదాన్ సాగర్‌రెడ్డి, రామ్మోహన్ రావు, సీహెచ్. మురళీ కృష్ణ, విజితా రెడ్డి, లక్ష్మణ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.